# మరి, మీరేమంటారు?

"స్వరాజ్యలక్ష్మికి ఏదో జబ్బుచేసిందని విన్నాను, నిజమేనా?"

"నేనూ విన్నాను. కాని ఆ జబ్బు ఏమిటో తెలియదు."

"నిన్న ఆస్పత్రిలో అడ్మిట్ చేశారట."

"ఆస్పత్రిలో అడ్మిట్ చేయాల్సినంత ప్రమాదకరమైన జబ్బు కాకపోవచ్చు. ఏదో గాభరాపడి తండ్రి అడ్మిట్ చేసి వుంటాడని నా నమ్మకం."

"ప్రమాదకరం కాకపోయినా, ఒకమాటు మనం వెళ్ళి చూచిరావడం చాలా అవసరం."

"ఆ సంగతే నేనూ అనుకుంటున్నాను."

"మరి ఎప్పుడు వెడదామంటావు?"

"ఈ రోజున వీలుపడదు, రేపు ఒకపార్టీవుంది. పోనీ ఎల్లుండిసాయంత్రం వెడితే?"

"........."

"ఏమిటి ఆలోచిస్తున్నావు?"

"ఏముంది ఆలోచించడానికి? ఎల్లుండి సాయంత్రం దాకా ఆగడం బాగుంటుందా అని ఆలోచిస్తున్నాను."

"మరింతకీ ఏమంటావు?"

"రాగద్వేషాలు వేసేవరకూ, రోజూ వాళ్ళయింటి చుట్టూ పదిసార్లు తిరిగి, నాటికప్రదర్శనం జరిగిన పదిరోజులకే స్వరాజ్యలక్ష్మి జబ్బుపడిందని తెలిసినా, ఆ ఛాయలకి వెళ్ళక పోవడం, నాకేమాత్రం బాగుండడంలేదు."

"అసలు వెళ్ళకపోతే కదూ, నీకు బాగుండక పోవ డానికి ?"

"తెలియకడుగుతాను—మీ యిద్దరిమధ్య వ్యవహా రం ఏమీ బెడిసిపోలేదు కదా ?"

"అసలు వ్యవహారం అంటూ ఒకటివుంటే కదూ, బెడిసి పోవడానికి ?"

"ఆ మధ్య మీ రిద్దరూ ఒకరి నొకరు ప్రేమించు కున్నట్లు కనపడిందే ?"

"నా మట్టుకు నేను ఆ అమ్మాయిని కొంత కాలం క్రితంవరకూ ప్రేమించిన మాట నిజమే – కాని ఆ అమ్మాయి నన్ను ప్రేమిస్తున్నదో, లేదో ఎంత బుర్ర చించుకున్నా అప్పట్లో అంతు చిక్కలేదు."

"అయితే ఇంకేం, సగం సక్సెస్‌ఫుల్ అన్నమాట."

"వేళాకోళానికి ఏంగాని, ఆ తండ్రి వున్నాడే పానకంలో పుడకలాగా అడ్డుపడుతున్నాడు."

"అదీ, నీ వైముఖ్యానికి కారణం – అంతేనా ?"

"కాదనుకో ... అయినా పరిస్థితుల్ని బట్టి మసలు కోవడం మంచిదనుకుంటాను."

"మీ కేదో బంధుత్వం కూడా వుందను కుంటాను?"

"ఆఁ, అంత చెప్పుకోదగ్గ బంధుత్వం కాదు."

"ఇంతకీ, నువ్వునిజంగా ఆ అమ్మాయిని ప్రేమించావా?"

"పదిహేను రోజుల క్రితంవరకూ ప్రేమించాననే అనుకున్నాను."

"తండ్రి అడ్డుపడేసరికి, ఆ వున్న కాస్త ప్రేమా ఎగిరి పోయింది అవునా ?"

"ఎగిరిపోయిందో, లేదో చెప్పలేనుకాని శాస్త్ర అంత రాయం కలిగిన మాట మాత్రం నిజం."

"ఈ రోజుల్లో ఏ శాస్త్ర విఘ్నంకలిగినా, ప్రేమ ఎగిరి పోతుందన్న మాట?"

"నే నేమైనా మజ్నూనా, ఒకసారి ప్రేమించిన వ్యక్తినే పట్టుకొని కలకాలం పాకులాడడానికి?"

"ఒక వ్యక్తిని ప్రేమించనంత మాత్రాన, మానవ నైజమైన సానుభూతికూడా వుండనక్కర లేదా?"

"ఆ సానుభూతి వుండడంవల్లనే, ఎల్లుండి స్వరాజ్య లక్ష్మిని చూడడానికి వెడుదా మంటున్నాను."

"ఇంతకీ, ఈ రోజూ, రేపూ వీల్లేదంటావు–అంతేనా?"

"అంతేనని వేరే చెప్పాలా?"

"ఎల్లుండి వెళ్ళడం నికరమేనా?"

"ఈ ఘడియ వరకూ ఖాయమే – అయినా ముందు సంగతి మనం ఎల్లా చెప్పగలం?"

"ఇంక నన్ను వెళ్ళిరమ్మంటావా?"

"మరి రేపు సాయంత్రం ఒకమాటు కనపడతావా?"

"రేపు ఎక్కడికో పార్టీకి వెళ్ళాలన్నావు?"

"పార్టీ జరిగేదీ, లేనిదీ ఇంకా నిశ్చయం కాలేదు. జరిగినా ఏ ఏడుగంటలకో జరుగుతుంది."

"సరే వీలుంటే అలాగే కనబడతాను."

"వీలూ గీలూ కట్టిపెట్టి, రేపు సాయంత్రం ఒకమాటు తప్పకుండా కనపడు."

నాగేశ్వరరావు దగ్గర సెలవు తీసుకున్నా నన్నమాటే కాని, అతను, తానూ బజారుకు వస్తాననడంతో అక్కడ

నుంచి వెంటనే కదలలేక పోయాను. అతను దుస్తులు మార్చు కునేవరకూ ఆగి, నాగేశ్వరరావు గదినించి ఉభయులమూ బజారుకు బయల్దేరాం. దారి పొడుగునా ఎందరో పరిచితుల్నీ, మిత్రుల్నీ కలుసుకుంటూ, కోఠీ దగ్గర "తాజ్" లోకి వెళ్ళాం. "తాజ్"లో రఘురామారావూ, చంద్రమౌళీ కనపడ్డారు. ఉభయులూ కాఫీ సేవిస్తున్నారు. ఉభయులు "రాగద్వేషా"లతో సంబంధంకల వారే. కాగా ఆనాట కంలో పాల్గొన్న వారే. మామూలు కుశల ప్రశ్నల తరువాత తిరిగి స్వరాజ్యలక్ష్మి ప్రసక్తి వచ్చింది. ఆ హోటల్ లో –

"ఇంతకీ స్వరాజ్యలక్ష్మిని చూడడానికి మీరు వెళ్ళ లేదా ?" అని అడిగాడు చంద్రమౌళి, నన్నూ, నాగేశ్వర రావుని ఉద్దేశించి–ఆ ప్రశ్నకి సూటిగా సమాధానం చెప్పక, అదే ప్రశ్నని వేరే మాటల్లో చంద్రమౌళి మొహాన తిప్పి కొట్టాను.

"మీరు వెళ్ళారా ?"

ఆ "మీరు"లో తానూ ఇమిడివుండడం, రఘురామా రావు గ్రహించాడు.

"ఎప్పటికప్పుడు వెడుదా మనుకోవడంతో రోజులు గడిచిపోతున్నాయి" అన్నాడు రఘురామారావు సమా ధానంగా.

"మేమూ అంతే ననుకో" అని నేనూ క్లుప్తంగా జవాబు చెప్పాను.

"ఎవరు వెళ్ళకపోయినా, నాగేశ్వరరావు వెళ్ళి చూడకపోవడం ఏ మాత్రం బాగుండలేదు" అన్నాడు చంద్ర మౌళి.

"ఆ విషయంలో అందరమూ దోషులమే — ఏ ఒక్కరి పైనో దోషం ఆపాదించి ఏంలాభం?" అన్నాను నేను, నాగేశ్వరరావు పైన మోపబడిన నేరాన్ని తొలగించి వేయ డానికి ప్రయత్నిస్తూ.

"ఆ అమ్మాయి ఆ అపస్మారకస్థితిలోకూడా, 'నాగేశ్వర రావు' అని పలవరిస్తున్నదట" అన్నాడు రఘురామారావు మా ధోరణికి కొద్దిగా అడ్డుతగులుతూ.

"ఇంతకీ జబ్బేమిటి?" అని ప్రశ్నించాడు నాగేశ్వర రావు గంభీరంగా రఘురామారావుని.

"ఒకనాటి సాయంత్రం ఏదో కాస్త జ్వరం వచ్చిందట. ఏదో మామూలు జ్వరమని మొదట అశ్రద్ధ చేశారట. మరు నాటి సాయంత్రం 104 డిగ్రీలవరకూ జ్వరం హెచ్చిందట. దానితో తండ్రి గాభరాపడి, డాక్టర్‌ని తీసుకొచ్చాడట. డాక్టర్ మొదట 'టైఫాయిడ్' అని ఏదో ఇంజక్షన్ యిచ్చా డట. జ్వరం తగ్గకపోగా, అపస్మారకస్థితి ఏర్పడిందట. డాక్టర్ తిరిగి పరీక్షించి, డబుల్ నిమోనియా కిందికి తేల్చా డట. 'వెంటనే ఆస్పత్రిలో అడ్మిట్ చెయ్యమ'ని సలహా యిచ్చాడట. 'గోరుచుట్టు పైన రోకటిపోటు' అన్నట్లు, ఆ జ్వరంలో పెరాలిటిక్ స్ట్రోక్ వచ్చిందట" అని జబ్బుకి సంబంధించిన వివరాలన్నీ చెప్పాడు రఘురామారావు.

"ఇక ఆ అమ్మాయి బ్రతికినా వికలాంగురాలు కాక తప్పదు" అని అభిప్రాయపడ్డాడు, చంద్రమౌళి, జబ్బుకి సంబం ధించిన వివరాలన్నీ నింపాదిగా అవగాహన చేసుకుంటూ.

"స్వరాజ్యలక్ష్మి, పాపం, తలి దండ్రులకు ఏకైక పుత్రిక. ఆమె వికలాంగురా లయితే, వాళ్ళు యావజ్జీవితం దుఃఖించాల్సి వస్తుంది" అన్నాను నేను, విచారం ఉట్టి పడుతున్న కంఠంతో.

"పోనీ, ఈ రోజు వెళ్లి స్వరాజ్యలక్ష్మిని చూచి వద్దామా ?" అన్నాడు చంద్రమౌళి, నా మాటలకి కదిలిపోతూ.

"ఇప్పటికే ఎనిమిదిగంటలైంది. కాగా ఆసుపత్రి తలుపులు కూడా వేసి ఉంటారు. ఇంకెక్కడికి వెడుతాము" అన్నాడు నాగేశ్వరరావు, వాస్తవిక ప్రపంచానికి మమ్మల్ని దిగలాగుతూ.

"పోనీ రేపు వెడుదామా" అని ప్రశ్నించాను నేను, నాఆతురతకొద్దీ.

"రేపు నేను రాలేను — నాకు కొద్దిగా పనుంది" అన్నాడు నాగేశ్వరరావు నిర్మోహమాటంగా.

"ఎల్లుండి ఎల్లాగూ వెడుదామనుకున్నాం కదూ ? మీరు కూడా వస్తారా ?" అని చంద్రమౌళీ, రఘురామాపురాల కేసి చూచాను.

"అనవసరంగా ఆలస్యం చేసుకుంటున్నామేమో ?" అనే సందేహాన్ని వెలిబుచ్చాడు చంద్రమౌళి.

నేను ప్రశ్నార్థకంగా నాగేశ్వరరావు కేసి చూచాను.

"మీ ఇష్టంవస్తే రేపు మీరు ముగ్గురూ వెళ్ళండి — నేను మాత్రం రాలేను" అని నిష్ఠూర మాడాడు నాగేశ్వరరావు.

విధిలేక మరునాడు స్వరాజ్యలక్ష్మిని చూడడం మానుకున్నాం.

"ఎల్లుండి సాయంత్రం నాగేశ్వరరావు గదిలో కలుసుకుందాం" అనే నిశ్చయానికి వచ్చి 'తాజ్' నించి నలుగురు మిత్రులం, నాలుగు వేపులా బయల్దేరాము.

ఆ మరుసటి రోజున సాయంత్రం అయిదు గంటలకి నేను నాగేశ్వరరావుని అతని గదిలో కలుసుకున్నాను. నాగేశ్వరరావు పార్టీకి వెళ్ళలేదు. ఏవో కబుర్లు చెప్తూ కుంటూ, తన గదిలోనే కాలం వెళ్ళబుచ్చాడు. మధ్యలో నేను "స్వరాజ్యలక్ష్మిని చూడడానికి వెడుదాం" అంటే, "రేపు ఎల్లాగో వెడుతున్నాం కదూ, ఈ రోజున కూడా వెళ్ళడం దేనికి"కని నా మాట ఎగుర గొట్టాడు. ఎదురు చూచిన ఎల్లుండి వచ్చింది. ఆ సాయంత్రం సరిగ్గా అయిదు గంటలకి నాగేశ్వరరావు గదికి వెళ్ళాను. తలుపు తాళం వేసి ఉంది. గదిముందే తారట్లాడడం మొదలు పెట్టాను. ఎంతకీ తైం గడవదు. బుర్రలో ఏవో ఆలోచనలు కదులుతున్నాయి ... మేమంతా కలసి "రాగద్వేషాలు" అనే నాటకం వేయడం ... ఒకొకసారి స్వరాజ్యలక్ష్మి ఇంట్లోనే రిహార్సల్సు వేయడం ... నాగేశ్వరరావు ఒకటే పనిగా స్వరాజ్యలక్ష్మికేసి చూడడం ... ఆమె జవాబుగా అతని చూపుల్లో చూపులు కలపడం ... ఉభయులూ కళ్ళతో మాట్లాడుకోవడం ... వాళ్ళు పరధ్యాన్నంగా వున్నపుడు మేము నాగేశ్వరరావుని పలుకరించడం ... అతను అఘాటు పాటున ఒకదానికి ఇంకొకటి సమాధానం చెప్పడం...మిత్ర

బృందమంతా చిరునవ్వు నవ్వుకోవడం ... ఆ విషయాలన్నీ ఒక్కొక్కటిగా నాకు జ్ఞాపకం వచ్చాయి.

ఆ రోజుల్లో "రాగద్వేషాల్లో" పాల్గొన్న నటీనటుల మంతా ఒక కుటుంబంగా మెలిగే వాళ్ళం — అందరికీ ఒకటే ధ్యేయం, నాటకం ఏవిధంగానైనా విజయవంతం చేయాలని. ఈ బృహత్కథలో నాగేశ్వరరావు, స్వరాజ్యలక్ష్మి ప్రేమ కలాపాలు అప్పట్లో మాకు చిత్రకథలుగా ఉండేవి...

ఇంతలోకే చంద్రమౌళి వచ్చాడు. ఏవో కబుర్లతో కొంత కాలక్షేపం చేసాం — ఆరుగంటలైంది. ఆనాడు ఎందుకో రఘురామారావు రాలేదు. దాదాపు ఏడు గంటలకి నాగేశ్వరరావు గదికి వచ్చాడు.

"ఎక్కడికి వెళ్ళావురా ?" అని నేను అడిగితే, "నేను చేసే ప్రతి పనికీ సంజాయిషీ చెప్పుకోవాలా ?" అని నన్ను దబాయించాడు. నేను చేసేదేమీ లేక మౌనం వహించాను. రఘురామారావు రాకపోవడంతో, ఆ సాకుపైన 'ఆసుపత్రికి వెళ్ళడం' ఆ మరునటిరోజుకి వాయిదా వేశాడు నాగేశ్వరరావు.

'రేపు', 'రేపు' అని వాయిదాలు వేయడంతో, రోజులు గడిచి పోతున్నాయి. ఈ మధ్య, మిత్రులలో ఏ ఒక్కరమూ, ఆసుపత్రికి వెళ్లి స్వరాజ్యలక్ష్మిని చూచి రాలేదు. కాని మాలో మేము కలుసుకున్నప్పుడల్లా స్వరాజ్య లక్ష్మి పట్ల మాటల ద్వారా సానుభూతి చూపెడుతూనే ఉన్నాం—ప్రతి రోజూ, మిత్రులమంతా, ఎక్కడో అక్కడ కలుసుకోవడం జరుగుతూనే ఉంది. కలుసుకున్నప్పుడల్లా, రేపు తప్పక వెడుదామని కూడబలుక్కోవడం తటస్థిస్తూనే ఉంది.

ఒకనాటి సాయంత్రం ఎందుకో నా మనస్సు, మన స్సులో లేదు. ఏమీ తోచక నాగేశ్వరరావు గది కేసి బయ ల్దేరాను. దారిలో చంద్రమౌళి దూరంగా కనపడ్డాడు. దగ్గరికి వచ్చీ రావడంతోనే, "నీకు తెలిసిందా?" అని ప్రశ్నించాడు.

"జరిగిం దేమిటి, తెలియడానికి?" అని నేను చంద్ర మౌళిని ఎదురు ప్రశ్న వేశాను.

"ఇంతకీ నీకేమీ తెలియ దన్నమాట" అని చప్ప రించి వేశాడు చంద్రమౌళి.

అతను నన్ను చులకన చేసి, ఆ విధంగా చప్పరించి వేయడం నా కేమాత్రం నచ్చలేదు. పైగా నాకు కాస్త కోపం కూడా వచ్చింది.

"నీకు మహా తెలిసిం దేమిటో చెప్పి ఏడ్వ గూడదూ?" అని ఉక్రోషంకొద్దీ విసిరి కొట్టాను.

"స్వరాజ్యలక్ష్మి నేటి ఉదయం నాలుగు గంటలకి మరణించింది" అని చంద్రమౌళి చావు కబురు చల్లగా చెప్పాడు.

"ఆఁ" అని మాత్రం అనగలిగాను. ఆ తరువాత ఎంతోసేపటి వరకూ నాకు మాట పెగల్లేదు.

"ఈ దారిలో అలా దిగాలుపడి నిలబడడ మేమిటి? వెడుదాం పద" అని హెచ్చరిక చేశాడు చంద్రమౌళి.

ఉభయులమూ మౌనంగా నాగేశ్వరరావు గది కేసి బయల్దేరాం.

రఘురామారావు, నాగేశ్వర రావు గదిలో నేవున్నాడు.

"ఏమిటి అలా వున్నారు ?" అని ప్రశ్నించాడు రఘు రామారావు మేము వెళ్ళి వెళ్ళడం తోనే.

నేను ఏమీ మాట్లాడ లేదు.

చంద్రమౌళి తనకు తెలిసిన సంగతి కాస్తా చెప్పాడు.

"అయ్యో పాపం, ఎంత ఘోరం జరిగిందీ" అన్నాడు రఘురామారావు సంగతి సందర్భాలు ఆకళింపు చేసుకొంటూ.

"ఆ తలిదండ్రుల ఘోష ఇంక మనం చూడలేం" అని అభిప్రాయపడ్డాడు చంద్రమౌళి ఆవిషాద సంఘటనని గూర్చి.

"ఎవరి కర్మకి ఎవరు కర్తలు ?" అంటూ పారలౌకిక ధోరణిలో పడ్డాడు నాగేశ్వరరావు.

"రేపు ఒకమాటు వెళ్ళి, ఆ తలిదండ్రుల్ని పరామర్శించివస్తే" అని సూచించాను నేను ఏమీ తోచక.

"దానివల్ల వాళ్ళ దుఃఖాన్ని యినుమడింపజేసిన వాళ్ళం కావడం తప్ప, వేరే ప్రయోజనం ఏమీ వుండదని" అభిప్రాయపడ్డాడు నాగేశ్వరరావు.

ఆ తరువాత గదికి తాళంవేసి, బజారుకు బయల్దేరాం.

యథాప్రకారం "తాజ్"కి వెళ్ళాం.

టీలు సేవిస్తు, అప్పట్లో మాకు తోచిన సానుభూతి వచనాలు పలికాం.

"ఎంత చలాకీ అయిన అమ్మాయి!" అన్నాడు చంద్రమౌళి టీ చప్పరిస్తూ.

"రాగద్వేషాలలో ఎంత అద్భుతంగా నటించింది!" అని అందుకున్నాడు రఘురామారావు.

"ఎంతటి స్నేహపాత్రురాలు!" అని అన్నాడు నాగేశ్వరరావు దిక్కులు పరికిస్తూ.

"ఆ మృత్యువు ముందు, ఎన్ని సద్గుణాలు వున్నా ఏమీ లాభం ఉండదు" అని అన్నాను నేను ఓ తాత్వికుని ధోరణిలో.

ఆ నాలుగు సానుభూతి వచనాలతో, మా బాధ్యత తీరింది.

మా హృదయాల చుట్టూ తిరిగి యినుప తెరలు దించుకున్నాయి.

ఆ విషాద సంఘటన విస్మృతి గహ్వారంలో పడింది.

ఈ సంఘటనానంతరం ఎందుకో, మనం బూటకపు ప్రేమలూ, బూటకపు మమతలూ ప్రదర్శించడంతో కాలం వెళ్ళబుచ్చుతున్నట్లు తోచింది నాకు. నిజమైన సానుభూతిని మనం రోజుకు రోజు కోల్పోతున్నట్లు కనపడింది. ఎప్పటి కప్పుడు మనకి మనం శ్రీరామరక్ష పెట్టుకుంటూ, యితరుల పట్ల యాంత్రికంగా, పెదవులమీదుగా సానుభూతి కనపరుస్తున్నట్లు గోచరించింది. మరి మీ రేమంటారు? "నిజమే" నంటారా?

★